సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 7 । జనవరి । 2023



ఆరోగ్యమస్తు

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పేద, మధ్య తరగతి వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తోంది.

- 8లో



హైదరాబాద్‌పై ఆంధ్రా ఘన విజయం

జిల్లా వేదికగా జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్‌పై ఆంధ్రా జట్టు 154 పరుగుల తేడాతో విజయం సాధించింది.

- 8లో

బాధ్యతల స్వీకరణ



విజయనగరం ఫోర్ట్: జిల్లా బాలల సంరక్షణ అధికారిగా అల్లు సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీడీపీఓగా పనిచేసిన జీహెచ్ లక్ష్మికి కృష్ణా జిల్లాకు బదిలీ అయింది. విశాఖపట్నం నుంచి సత్యనారాయణ ఇక్కడకు వచ్చారు. బాలల హక్కుల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.

న్యూస్‌రీల్

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు సమకూర్చుతోందని డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు. జిల్లాకు మంజూరైన రూ.5.50 లక్షలు విలువచేసే ట్రైసైకిళ్లు–13, వీల్‌చైర్లు–35, వినికిడి యంత్రాలు–28, రొలేటర్స్–11, సీపీ చైర్స్–9ను విద్యార్థులకు డీఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ భానుమూర్తి, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు సీజ్



పార్వతీపురంలో పోలీసులు సీజ్ చేసిన లారీలు

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను సీజ్ చేశామని ఎస్సై శివప్రసాద్ తెలిపారు. సంకిలి సమీపంలోని నాగావళి బ్రిడ్జివద్ద జిల్లా అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో దాడులు నిర్వహించామని, ఆ సమయంలో ఇసుకతో వెళ్తున్న 13 లారీలు, ఖాళీగా ఉన్న మరో 7 లారీలను సీజ్‌చేసి పార్వతీపురం తరలించామని చెప్పారు. లారీ డ్రైవర్లు, యజమానులతో పాటు, ఇద్దరు నిర్వాహకులపై కేసు నమోదు చేశామన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం

- కోపరేటివ్ డివిజనల్ రిజిస్ట్రార్ అలజంగి జార్జి



కాశీపేట పీఏసీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డివిజనల్ కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ జార్జి

సీతానగరం: మండలంలోని పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తామని పార్వతీపురం మన్యం జిల్లా డివిజనల్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ అలజంగి జార్జి అన్నారు. ఆర్.వెంకంపేట, కాశీపేట పీఏసీఎస్‌లు, రైతుభరోసా కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌ల పరిధిలో 229 మంది రైతులున్నారని, ఇప్పటివరకు 853.8 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్లు పి.సత్యం, ధనుంజ నాయుడు, సర్పంచ్ పి.శ్రీనివాసరావు, సీఈఓలు వై.త్రినాథ్, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు జగదీష్, టి.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నాబార్డు నిధులతో గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణం

- ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్‌శాఖ అధికారి శ్రీనివాసరావు



పూడి-మిలియకంచూరు రోడ్డు పనులు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు

సాలూరు: జిల్లాలోని గిరిజన గ్రామాల్లో రూ.28 కోట్ల నాబార్డు నిధులతో రోడ్లు నిర్మిస్తున్నట్టు ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు. పాచిపెంట మండలంలో పూడి నుంచి మిలియకంచూరు వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని శుక్రవారం పరిశీలించారు. రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను ఈ నెల మార్చి నెలాఖరుకు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశాల మేరకు అరకు రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట ఐటీడీఏ ఈఈ శాంతేశ్వరరావు, డీఈ మణిరాజ్ తదితరులు ఉన్నారు.

అక్కచెల్లెమ్మల అభ్యున్నతికి
సర్కారు చేయూత

- మహిళల జీవితాల్లో 'సంక్షేమ' వికాసం
- వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలతో ఆర్థికోన్నతి
- సొంత వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళామణులు
- సున్నావడ్డీ ద్వారా 19,411 సంఘాలకు రూ.32.64 కోట్ల లబ్ధి
- 75,290 మంది లబ్ధిదారులకు రూ.376.71కోట్ల 'చేయూత'
- 16,645 సంఘాలకు రూ.188.7 కోట్ల ఆర్థిక 'ఆసరా'
- తాజాగా మూడో విడత అర్హుల ఎంపిక
- 14,383 సంఘాల పరిధిలోని 1,59,509 మంది సభ్యులకు రూ.85 కోట్ల చెల్లింపునకు రంగం సిద్ధం



బలిజిపేట: సమావేశమైన పొదుపు సంఘం మహిళలు



వైకేపీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్/బలిజిపేట:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అక్కచెల్లెమ్మల ఆర్థికాభ్యున్నతికి దోహదపడుతున్నాయి. స్వయం ఉపాధికి 'చేయూత'గా నిలుస్తున్నాయి. ఆర్థికంగా ఎదిగేందుకు 'ఆసరా' కల్పిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని అతివల్లో ఆర్థిక వికాసం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో రుణాలు మంజూరు కాక, ఆర్థిక సాయం సకాలంలో అందక ఇబ్బందులు పడే స్వయం సంఘాల మహిళలు.. మూడున్నరేళ్లుగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. కిరాణా వ్యాపారాలు, డెయిరీలు, కోళ్ల పెంపకం, కుటీర పరిశ్రమల నిర్వహణతో కుటుంబానికి చేదోడుగా ఉంటున్నారు. ఆర్థికోన్నతి దిశగా సాగుతున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం

సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ప్రజాసంకల్పయాత్ర చేసిన సమయంలో అధికారంలోకి వస్తే దశలవారీగా డ్వాక్రా రుణాలు మాఫీచేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలులోకి తెచ్చారు. ఏప్రిల్ 11, 2019నాటికి డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా ఆయా సంఘాలకు చెల్లిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా రుణమాఫీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. మూడో విడత చెల్లింపులకు సిద్ధమవుతున్నారు. అర్హుల ఎంపికను పూర్తిచేశారు.

వైఎస్సార్ చేయూతతో జీవనోపాధి ఇలా..	
జీవనోపాధి	యూనిట్ల సంఖ్య
రిటైల్ రంగం	2,692
టెక్స్‌టైల్	500
డెయిరీ రంగం	6,057
గొర్రెలు, మేకల పెంపకం	3,894
పెరటి కోళ్ల పెంపకం	2,570
ఆహార ఉత్పత్తులు	318
వ్యవసాయ ఉత్పత్తులు	2,418
ఇతర రంగాలు	2,376

స్వయం ఉపాధి దిశగా..



స్వయంసహాయక సంఘ సభ్యురాలిగా ఉన్నాను. నాకు ఆసరా పథకం కింద అందిన మొత్తంతో కార్పెంట్ యంత్రాలను సమకూర్చుకున్నాను. కష్టపడి పనిచేస్తున్నాను. నెల నెలా రూ.10వేలకు తగ్గకుండా సంపాదిస్తున్నాను. గతంతో పోల్చుకుంటే మా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. సమాజంలో గుర్తింపు లభించింది. బ్యాంకు రుణం తీసుకుని వ్యాపార అభివృద్ధిపై దృష్టిపెట్టాను. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు మరచిపోలేనిది.

– కుప్పిలి సుజాత, అట్టలి గ్రామం, పాలకొండ మండలం

లబ్ధిదారుల జాబితా సిద్ధం



వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధి ఈ నెలలోనే లబ్ధిదారుల ఖాతాలకు జమకానుంది. ఇప్పటికే అర్హుల జాబితాలు సిద్ధం చేశాం. బయోమెట్రిక్‌ను పూర్తిచేశాం. ప్రభుత్వ ఆదేశాలతో పంపిణీ జరుగుతుంది. లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమవుతాయి.

– కిరణ్‌కుమార్, పీడీ, డీఆర్‌డీఏ, పార్వతీపురం మన్యం జిల్లా

మూడో విడత చెల్లింపులకు సన్నద్ధం



నవరత్నాల పేరిట ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో తొలి ప్రాధాన్యం మహిళలకే. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ వంటి పథకాలతో మహిళల ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తున్నారు. అతిత్వరలో అక్కచెల్లెమ్మలకు ఆసరా మూడోవిడత లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు అర్హుల జాబితాలను సిద్ధం చేశాం. జిల్లా పరిధిలో 14,383 సంఘాల్లోని లక్షా 59వేల509 మందికి రూ.85 కోట్ల లబ్ధి చేకూరనుంది.

– వై.సత్యంనాయుడు, ట్రైబల్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్, డీఆర్‌డీఏ ఏపీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

వివిధ సంక్షేమ పథకాల ద్వారా వైకేపీ సభ్యులకు అందిన లబ్ధి (రూ.కోట్లలో)				
వైఎస్సార్ ఆసరా	గ్రామీణ లబ్ధిదారులు	లబ్ధి	పట్టణ లబ్ధిదారులు	లబ్ధి
తొలి విడత	14,271	78.18	2,240	15.29
రెండోవిడత	14,383	79.65	2262	15.58
వైఎస్సార్ సున్నా వడ్డీ				
మొదటి విడత	14,192	7.15	2,503	3.08
రెండవ విడత	16,226	7.14	2,178	3.04
మూడవ విడత	17233	9.14	2,178	3.09
వైఎస్సార్ చేయూత				
మొదటి విడత	55,128	103.37	6,363	11.92
రెండవ విడత	57,838	108.44	6,595	12.36
మూడవ విడత	68,032	127.56	7,258	13.06

పెథాలజీ ల్యాబ్ ప్రారంభం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పెథాలజీ ల్యాబ్‌ను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అందుబాటులో లేని ఎఫ్ఎన్ఏసీ, పాప్స్మీర్ వంటి పరీక్షలు ఇకపై సర్వజన ఆస్పత్రిలోనే చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఈసేవల కోసం రిఫరల్ ఆస్పత్రికి పంపించేవారమని, ఇకపై ఇక్కడే అందిస్తామన్నారు. కేన్సర్ నిర్ధారణ పరీక్ష సేవలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుల జాబితా విడుదల

- విజయనగరం ఉమ్మడి జిల్లాలో 170 ప్రాజెక్టుల ఎంపిక
- ప్రతీ ప్రాజెక్టుకు రూ.10 వేలు ఇవ్వనున్న ప్రభుత్వం

వీరఘట్టం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, పరిశోధనలపై ఆసక్తి పెంచడం ఇన్‌స్పైర్ అవార్డుల ప్రధాన ఉద్దేశం. 2022–23 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ అవార్డుల కోసం విద్యాశాఖ మూడు నెలల కిందట విద్యార్థుల నుంచి వివిధ విజ్ఞాన ప్రాజెక్టులను ఆహ్వానించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ప్రతీ హైస్కూల్ నుంచి ఐదు , యూపీ స్కూల్ నుంచి 3 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిని పరిశీలించిన విద్యాశాఖ అధికారులు పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 52, విజయనగరం జిల్లా నుంచి 118 ప్రాజెక్టులను ఎంపిక చేస్తూ ఆ జాబితాను శుక్రవారం విడుదల చేశారు. ఎంపికైన ప్రతీ ప్రాజెక్టుకు రూ.10వేలను విద్యాశాఖ ఇవ్వనుంది. ఆ డబ్బులతో విద్యార్థులు తాము రూపొందించాల్సిన ప్రాజెక్టులకు మెరుగులద్ది జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలోను, అక్కడ నుంచి జాతీయ స్థాయికి ఎంపికవుతాయని పార్వతీపురం మన్యం జిల్లా సైన్స్‌ప్రాజెక్టుల ప్రదర్శన అధికారి జి.లక్ష్మణరావు తెలిపారు.

మొబైల్ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభం

కాశీబుగ్గ: వ్యవసాయి రంగంలో మరింత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో సెంచూరియన్ యూనివర్సిటీ యాజమాన్యం ఆధ్వర్యంలో అశోక్ లైలాండ్ సహకారంతో ఏర్పాటు చేసిన మొబైల్ నాలెడ్జ్ సెంటర్‌ను పలాస క్యాంప్ కార్యాలయం ప్రాంగణంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఫల్గునరావు, గ్రామ తరంగ్ పర్లాఖిమిడి సేల్స్ హెడ్ చలపతిరావు, యూనివర్సిటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొబైల్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



ఇద్దరు స్టూవర్ట్‌పురం
దొంగల అరెస్టు

- రూ 70వేల నగదు, ఐదుసెల్ ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం
- వీరిపై పలు స్టేషన్లలో కేసుల నమోదు



విలేకరులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్:

స్టూవర్ట్‌పురం దొంగలను విజయనగరం రూరల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఫిర్యాదు అందుకున్న ఒకటిన్నర రోజుల వ్యవధిలోనే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు శుక్రవారం వెల్లడించారు. బాపట్ల జిల్లా చినబేతపూడి పంచాయతీ వెదుళ్లపల్లి, స్టూవర్ట్‌పురం గ్రామాలకు చెందిన మానుపాటి దుర్గాప్రసాద్ అలియాస్ చిన్నోడు, కర్రెద్దుల మహేష్ అలియాస్ చినబాబు ఈ నెల 4వ తేదీన ఏటీఎం వద్ద నగదు విత్ డ్రా చేసే వృద్ధుల కోసం పడిగాపులు కాశారు. ద్వారపూడికి చెందిన డోల పాపుడు అనే వ్యక్తి ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అక్కడ నుంచి ద్వారపూడి పంచాయతీ విజయకుమార్ లేఅవుట్ వద్ద ఆపి మలమూత్ర విసర్జనకు వెళ్లాడు. అతడిని గమనిస్తూ వెంట వచ్చిన స్టూవర్ట్‌పురం దొంగలు తమ వద్దనున్న ఆయుధాలతో డిక్కీ ఓపెన్ చేశారు. ఈలోపు గమనించిన బాధితుడు వారివద్దకు వచ్చేసరికి కత్తితో బెదిరించి, డిక్కీలో ఉన్న రూ.లక్షా 10వేలు నగదు, భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, చెక్‌బుక్, గోల్డ్‌లోన్ డాక్యుమెంట్లు, డైరీలు, ఇంటి తాళాలు, బైక్ పేపర్లను పట్టుకుని పారిపోయారు. బాధితుడు లబోదిబోమంటూ రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్పీ దీపిక ఎం.పాటిల్ ఆదేశాలతో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ పుటేజీలు ఆధారంగా నిందితులను గుర్తించారు. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ధర్మపురి వసంత విహార్ వద్ద నిందితులను పట్టుకుని వారివద్ద నుంచి రూ.70వేలు నగదు, ఒక స్కూటీ, నేరం చేయడానికి ఉపయోగించిన హీరో స్పెండర్ బైక్, గతంలో వేర్వేరు చోట్ల దొంగతనం చేసిన ఐదు సెల్‌ఫోన్లు, నేరాలు చేసేందుకు ఉపయోగించే ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల, చీరాల, ఒంగోలు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిందితుడు దుర్గాప్రసాద్‌పై 12 కేసులు, మహేష్‌పై ఐదు కేసులు నమోదైనట్టు గుర్తించారు. ఉత్తరాంధ్రాలో తొలిసారిగా దొంగతనానికి పాల్పడినట్టు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్‌ఐ త్రినాథ్, కానిస్టేబుల్ షఫీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ గణేష్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, చోరీకి ఉపయోగించే ఇనుప సామగ్రి

నాణ్యతగా నాడు–నేడు పనులు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం:

ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని, నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని, నాణ్యతాప్రమాణాలు పాటించాలని, జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో పలు అంశాలపై శుక్రవారం సమీక్షించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలన్నారు. వంటకు వినియోగించే నీరు పరిశుభ్రంగా ఉండాలని, వీధుల్లో తిరిగే జంతువులు వంట ప్రదేశంలోకి రాకుండా చూసుకోవాలన్నారు. నాడు–నేడు పనుల్లో సీతానగరం చివరి మూడు స్థానాల్లో ఉందన్నారు. పనుల కోసం రూ.1.32 కోట్లను ముందస్తుగా విడుదల చేసినప్పటికీ రూ.1.12 కోట్లు మాత్రమే ఖర్చు చేయడంపై ఆయన ప్రశ్నించారు. పార్వతీపురం, సాలూరు మండలాల్లో రూ.30 లక్షలు చొప్పున, భామిని మండలంలో రూ.20 లక్షలు ఖర్చు కాకుండా ఉండటాన్ని ప్రశ్నించారు. వారం రోజుల్లో 95శాతం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్లుల అప్‌లోడ్ తక్షణం జరగాలన్నారు. లేదంటే పనులు పూర్తయినా వెనుకబాటు కనిపిస్తుందన్నారు. మరుగుదొడ్లకు శాశ్వత ప్రాతిపదికన రన్నింగ్‌వాటర్ సదుపాయం కల్పించాలన్నారు.

బైజూస్ బోధన మార్గదర్శనం

బైజూస్ బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. బడి వయసు పిల్లలు ఎక్కడా బడి బయట ఉండరాదన్నారు. జిల్లా అధికారులు ఒక్కో ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని విద్యాభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఇంగ్లిష్, గణితం, సైన్స్‌లో విద్యార్థులు పట్టుసాధించేలా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు బోధన సాగించాలన్నారు. బహిరంగ వేదికపై అనర్గలంగా మాట్లాడేలా తీర్చిదిద్దాలన్నారు. డీఈఓ ఎస్.డి.వి.రమణ మాట్లాడుతూ నాడు–నేడు పనులకు ప్రభుత్వం రూ.22.64 కోట్లు ముందస్తుగా విడుదల చేసిందని, రూ.20 కోట్ల మేర బిల్లులు అప్‌లోడ్ చేశామని చెప్పారు. 61 ప్రహరీలు మంజూరు కాగా, 17 పనులు ప్రారంభమైనట్టు వివరించారు. మక్కువ మండలంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి స్థల సమస్య ఉందని కలెక్టర్‌కు ఎంఈఓ వివరించగా పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీడీఈఓలు బ్రహ్మాజీరావు, విజయకుమారి, ఏపీఓ వై.శంకరరావు, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఆర్థికాభ్యున్నతికి తోడ్పడాలి

జిల్లా ఆర్థికాభ్యున్నతికి బ్యాంకులు తోడ్పడాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకర్లతో శుక్ర వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణాల మంజూరు వేగవంతం చేయాలని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో పాడి ఆవుల యూనిట్లు, చేపల యూనిట్ల ఏర్పాటుకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. స్టాండ్ ఆఫ్ ఇండియా, స్వనిధి, పీఎంఈజీపీ తదితర కార్య క్రమాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ జె.ఎల్.ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్రాధాన్యతా రంగాలకు సెప్టెంబర్ నెలాఖరుకు రూ. 186.43 కోట్లు లక్ష్యం కాగా రూ.113 కోట్లు, ప్రాధాన్యత లేని రంగాలకు రూ.39 కోట్లకు రూ.41 కోట్లను రుణాలుగా మంజూరు చేశామని చెప్పారు. వ్యవసాయానికి రూ.106 కోట్లకు రూ.63 కోట్లను అందించినట్టు వెల్లడించారు. జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, పాచిపెంట, భామిని మండలాల్లో జనా భాకు వీలుగా బ్యాంకింగ్ సేవలు అందించేందుకు మరో ఆరు శాఖలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. జగనన్న తోడు పథకం కింద 4,868 దరఖాస్తులు అందాయని వాటిలో 3,887 దరఖాస్తులకు రుణాలు మంజూరు చేశామన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు రూ.35వేలు రుణాన్ని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ నాగప్రవీణ్, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి నాగార్జున, ఎస్‌బీఐ, యూబీఐ, ఏపీజీవీబీ కంట్రోలర్లు వరుసగా వెంకటేష్‌దేశాయ్, ఎస్.దాస్, బి.రాఘవేంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఈశ్వరరావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం, బ్యాంకర్లు పాల్గొన్నారు.

శంబర పోలమాంబ జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, ఆలయ అధికారులు, పెద్దలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర వాల్‌పోస్టర్‌ను మక్కువ మండల కేంద్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఆలయ అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈనెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మన రాష్ట్రంలోనే అతి పెద్ద గిరిజనులు ముద్దబిడ్డ పోలమాంబ అమ్మవారి జాతర ఏటా జరుగుతుండడం మన అదృష్టంగా భావించాలన్నారు. గతంలో మక్కువ నుంచి శంబర, శంబర నుంచి సాలూరు మండలం మామిడిపల్లి వరకు రోడ్లు అధ్వానంగా ఉండేవని, ఈ ఏడాది జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొత్తగా నాణ్యమైన రోడ్లు నిర్మించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పి.దాలినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజయనగరంలో 'రామరాజ్'



షోరూం ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం ఫోర్ట్: పంచెలకు, షర్ట్‌లకు పేరొందిన రామరాజ్ సంస్థ కొత్త షోరూం విజయనగరంలో ప్రారంభమైంది. రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన షోరూంను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పు ప్రకాష్‌రావు, రోటరీ పూర్వ గవర్నర్ ఎం.రామారావు, ఉక్కు సూర్యనారాయణరాజు, రామరాజ్ గ్రూప్ చైర్మన్ కె.ఆర్.నాగరాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.ఆర్.నాగరాజన్ మాట్లాడుతూ బాక్టీరియా వైరల్ ఇన్‌ఫెక్షన్ నుంచి తట్టుకోవడానికి వీలుగా ఉండే పంచెలను కొత్తగా ప్రారంభించినట్టు చెప్పారు. కొత్త షోరూంలో తమ సంస్థ ఉత్పత్తి చేసే అన్ని రకాల దుస్తులను అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ పోటీలకు ఎంపికైన ఇంద్రావతి, గణేష్

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్, సీనియర్స్ విభాగాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డి.గణేష్, ఎస్.ఇంద్రావతిలు ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిర్డీలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైక్లింగ్ అససియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన ఇరువురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో రాణించాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు ఆకాంక్షించారు.

మూడు నెలల తర్వాత మృతుడి గుర్తింపు

- లొంగిపోయిన నిందితులు

బొబ్బిలి రూరల్: గతేడాది అక్టోబర్ 28న కలువరాయి గ్రామశివారులో నేలబావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన విషయం తెలిసిందే. అప్పట్లో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయగా...తాజాగా నిందితులు పట్టుబడడంతో మృతుడి వివరాలు వెలుగుచూశాయి. పట్టణ సీఐ ఎం.నాగేశ్వరరావు తెలియజేసిన వివరాల ప్రకారం.. గతేడాది అక్టోబర్ 28న నేలబావిలో లభ్యమైన మృతదేహం కలువరాయి గ్రామానికి చెందిన పాము సింహాచలానిది గుర్తించారు. గ్రామానికి చెందిన పడాల అప్పన్నకు సింహాచలం మధ్య విబేధాలు ఉండడంతో అప్పన్న, గుడిపూడి నారాయణరావు సహకారంతో సింహాచలంను హత్య చేసి బావిలో పడేశారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేయగా.. ఇటీవల నిందితులు మద్యం మత్తులో తామే సింహాచలంను హత్య చేసినట్లు గ్రామానికి చెందిన ముచ్చి గంగమ్మకు చెప్పారు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితులు పరారయ్యారు. ఇదిలా ఉంటే సర్పంచ్ బొత్స నటరాజ్ వద్ద నిందితులు అప్పన్న, నారాయణరావు నేరం అంగీకరించి పోలీసులకు శుక్రవారం లొంగిపోయారు. పోలీసులు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

ఆరోగ్యమస్తు

కార్పొరేట్ వైద్య సేవలను మించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. నాడు - నేడు ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేయడమే కాకుండా అన్ని చోట్ల అవసరమైన వైద్యులతో పాటు సిబ్బందిని నియమించింది. అవసరమైన మేరకు మందులు కూడా సరఫరా చేసింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ సౌకర్యాలు
- రోగులకు రూ.40నుంచి 80కి పెంచిన భోజన చార్జీలు
- పూర్తి స్థాయి సిబ్బంది నియామకానికి చర్యలు
- అందుబాటులో మందులు

జిల్లా స్థాయిలో సేవలు అందిస్తున్న ఆస్పత్రులు	
జిల్లా కేంద్ర ఆసుపత్రి	పార్వతీపురం
ఏరియా ఆస్పత్రులు	పాలకొండ, సీతంపేట, సాలూరు
సీహెచ్‌సీలు	కురుపాం, చినమేరంగి, భద్రగిరి



పాలకొండ ఏరియా ఆస్పత్రి



ఆస్పత్రికి చేరిన పూర్తి స్థాయి మందులు



పూర్తి సౌకర్యాలతో డయాలసిస్ విభాగం

పాలకొండ: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రధానంగా పేద, మధ్య తరగతి వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాదిరి వైద్యం అందించేలా ప్రభుత్వ ఆస్పత్రులను మార్పు చేస్తుంది. ఇందులో భాగంగా ప్రతి రోజు రోగులకు అందించే భోజనం ఖర్చులను రెట్టింపు చేయడంతో పాటు అన్ని రకాల మందులు, వైద్యులు, సిబ్బందిని నియమించింది. డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

భోజన చార్జీలు రెట్టింపు

జనవరి 22 నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందించే భోజనం కోసం ప్రభుత్వం ఏకంగా చార్జీలను రెట్టింపు చేసింది. ఇంతవరకు ప్రతి రోగికి రోజుకు రూ.40లు చెల్లించేది. ఇక నుంచి ఈ చార్జీలను రూ.80లకి పెంచుతూ జీవో జారీ చేసింది. దీంతో ఆస్పత్రిలోని రోగులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంది.

పూర్తి స్థాయిలో సిబ్బంది

ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల సేవలకు 98మంది ఉద్యోగులు, సీహెచ్‌సీలో 60 మంది సిబ్బందిని నిమించేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ఆస్పత్రుల్లో అన్ని విభాగాలకు వైద్యులను నియమించడంతో పాటు అన్ని రకాల పరీక్షలు చేపడుతున్నారు. మందుల కొరత లేకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల నిల్వలు అందుబాటులో ఉంచారు.

డిజిటలైజేషన్ దిశగా...

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంతవరకు పీవో నుంచి ప్రతీది పెన్నుతో రాసి ఇస్తున్నారు. ప్రస్తుతం వీటి స్థానంలో కంప్యూటర్‌లను ఏర్పాటు చేసి డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇందు కోసం ప్రతి ఆస్పత్రికి సుమారుగా 15 నుంచి 20 వరకు కంప్యూటర్లు, అందుకు కావాల్సిన సామగ్రిని అందించారు. ఓపీ చీటీలను ఇక నుంచి కంప్యూటర్ ద్వారా అందించనున్నారు.

పూర్తి స్థాయి సేవలు

ప్రభుత్వ ఆస్పత్రులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో మార్పు చేసింది. కోవిడ్ అనంతరం ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సిబ్బంది నియమకాలు పూర్తి చేసింది. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా సిబ్బంది కొరత లేదు. పెంచిన భోజన చార్జీలు అమలు కోసం టెండర్లు పిలుస్తున్నాం. 85శాతం మేరకు డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరుగుతున్నాయి. రోగులకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా పని చేస్తున్నాం.

– బి.వాగ్దేవి, డీసీహెచ్ఎస్, పార్వతీపురం మన్యం జిల్లా

హైదరాబాద్‌పై ఆంధ్రా ఘన విజయం



హైదరాబాద్‌పై విజయం సాధించిన ఆంధ్రా జట్టు

- రంజీ మ్యాచ్‌లో 154 పరుగుల తేడాతో గెలుపొందిన ఆంధ్రా జట్టు

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు ఘన విజయం సాధించింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో గత నాలుగు రోజులుగా ఆంధ్రా – హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో 154 పరుగుల తేడాతో ఆంధ్రా జట్టు విజయం సాధించింది. రెండవ ఇన్నింగ్స్‌లో ఆంధ్రా జట్టు బౌలర్‌లు కెవి.శశికాంత్ 23 ఓవర్లలో 5 వికెట్లు, కె.సుదర్శన్ 17 ఓవర్లలో 3 వికెట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. 25 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 75 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద నాల్గవ రోజు శుక్రవారం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు 73.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటయ్యారు. జట్టు బ్యాటింగ్‌లో చందన్ సాహిని 56 పరుగులు, కె.రోహిత్ రాయుడు 46 పరుగులతో రాణించి పర్వాలేదనిపించగా.. మిగిలిన క్రీడాకారులెవ్వరు ఎక్కువ సమయం మైదానంలో నిలవలేకపోయారు. దీంతో ఆంధ్రా జట్టు 154 పరుగులతో విజయం సాధించి 6 పాయింట్లను తన ఖాతాలో నమోదు చేసుకుంది. అంతకు ముందు హైదరబాద్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 197పరుగులు చేయగా... ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 135 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 462 పరుగులు చేసిన విషయం విదితమే. మ్యాచ్‌ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు, జిల్లా క్రికెట్ అసోసియేషన్, నార్త్‌జోన్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

లోకాయుక్త అంశాలపై నివేదికలు రూపొందించండి

- జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ శాఖల్లో తలెత్తిన సమస్యలపై నమోదైన లోకాయుక్త కేసులకు సంబంధించి నిర్ణీత కాలంలో పూర్తి వివరాలతో కూడిన నివేదికలు తయారు చేసుకోవాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు సూచించారు. జిల్లాలో నమోదైన లోకాయుక్త కేసుల తాజా పరిస్థితిపై వివిధ విభాగాల అధికారులతో ఆయన గురువారం తన చాంబర్లో సమావేశమయ్యారు. కేసుల పూర్వాపరాలు, తాజా స్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇరు వర్గాలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన జాబితాలను తయారు చేసుకొని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయా విభాగాల పరిధిలో నమోదైన కేసులపై సంబంధిత విభాగాధిపతులపై సంప్రదించి పూర్తి వివరాలు సమర్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

దళారీల నుంచి రైతులను కాపాడండి

- రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయండి
- జిల్లా అధికారులతో పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

విజయనగరం అర్బన్: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. రైతు నుంచి కొనుగోలు చేసిన దగ్గర నుంచి మిల్లులకు ధాన్యం చేరే వరకు పూర్తి పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో చిన్న సమస్య కూడా ఉత్పన్నం కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. దళారీల బెడద లేకుండా రైతులకు అన్ని రకాల సేవలు అందించాలని పేర్కొన్నారు. కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రైతులకు ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని చెప్పారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన జేసీ మయూర్ అశోక్, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అనుసరించాల్సిన సులభతర విధానాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రక్రియ సజావుగా సాగేలా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం నుంచి వచ్చిన బియ్యం మొత్తం కేవలం ప్రైవేట్ మిల్లుల వద్ద కాకుండా ఎఫ్‌సీఐ గోదాములకు కూడా తరలించాలని అధికారులను ఆదేశించారు. కాలయాపన జరగకుండా వెనువెంటనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ఈ ప్రక్రియలో జరిగే ప్రతి దశపై రైతులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని సూచించారు. బిల్లులు చెల్లింపులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపు గురించి, ఇతర ప్రక్రియల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాయింట్ కలెక్టర్ వివరించారు. కంట్రోల్ రూమ్ సేవల గురించి కూడా తెలియజేశారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ డీఎం మీనాకుమారి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

పాలకొండ: పట్టణంలోని రెల్లివీధికి చెందిన మైనర్ బాలికను నమ్మించి మోసగించిన కేసులో వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. బాలిక బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామని, శుక్రవారం నిందుతున్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



వైద్య సేవలు పొందుతూ మృతి చెందిన కాళ్ల సత్యనారాయణ

గజపతినగరం : మండలంలోని పురిటిపెంట కర్రల డిపో వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ(72) తన మనవడు రోహిత్‌కుమార్‌ను గజపతినగరంలో బస్సు ఎక్కించేందుకు తన బైక్‌పై తీసుకువెళ్తున్నాడు. మార్గంలో పురిటిపెంట కర్రల డిపో వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో కాళ్ల సత్యనారాయణకు బలంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్టు హెచ్‌సీ ఎస్.అంజిబాబు తెలిపారు. స్వల్పంగా గాయపడిన రోహిత్‌కుమార్‌ను గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నారు. రోహిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు గజపతినగరం ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువతి..

రాజాం సిటీ: మండల పరిధి నందబలగ గ్రామానికి చెందిన పొన్నాడ అమ్ములు (18) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందని ఎస్ఐ పి.నీలావతి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన అమ్ములు నర్సింగ్ కళాశాలలో చదువుతుంది. రుతుక్రమంలో వచ్చిన కడుపునొప్పి తాళలేక గత నెల 27న పురుగుల మందు సేవించి కళాశాలకు వెళ్లింది. అక్కడ పరిస్థితి విషమించి వాంతులు చేసుకోవడంతో అధ్యాపకులు కుటుంబీకులు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితిని పరిశీలించి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. ఆమె తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విజిలెన్స్ తనిఖీలు

వీరఘట్టం: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాలతో ఎస్ఐ బి.రామారావు పీహెచ్‌సీలో సోదాలు చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా...లేదా... మందులు అందుబాటులో ఉన్నాయా... వైద్యులు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా తదితర అంశాలపై ఆరా తీశారు. అయితే ఇక్కడ వైద్య సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.







గ్రూప్ - 1 పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు

- 5,530 మంది అభ్యర్థులు, 13 పరీక్ష కేంద్రాలు
- అభ్యర్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి
- ఉదయం 9.45, మధ్యాహ్నం 1.45 గంటల తరువాత అనుమతి లేదు
- జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధికారులను ఆదేశించారు. లైజనింగ్ అధికారులు, సెంటర్ చీఫ్ సూపరింటెంటెంట్లు, ఏపీపీఎస్‌సీ ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అందుకోసమే జిల్లా అధికారులను లైజనింగ్ అధికారులుగా ప్రభుత్వం నియమించిందని అన్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలోనే 13 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని మొత్తం 5,530 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థులను లైజనింగ్ అధికారులుగా ప్రభుత్వం ఆమోదించిన ఏదో ఒక గుర్తింపు కార్డును తీసుకొని రావాలని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన వారు 8309000534, 8333813468 నంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు. ఈ నెల 8న జరిగే గ్రూప్ – 1 పరీక్షల కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌ఓ తెలిపారు. ప్రతీ అభ్యర్థి ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు జరిగే రెండు పేపర్లను రాయాల్సి ఉంటుందని చెప్పారు. గంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం పరీక్షకు 9.45 గంటల తరువాత, మధ్యాహ్నం 1.45 గంటల తరువాత పరీక్ష కేంద్రం లోపలికి అభ్యర్థులకు ఎట్టి పరిస్థితిలోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు లోపలికిక అనుమతి లేదని తెలిపారు. ఇన్విజిలేటర్లు కూడా తమ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి తీసుకువెళ్లకూడదని స్పష్టం చేశారు. కోవిడ్‌ను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులకు థర్మల్ బాడీ స్క్రీనింగ్ చేయాలని సూచించారు. తాగు నీరు, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, చుట్టు ప్రక్కల జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. అంధులు, చేతితో రాయలేని విభిన్న ప్రతిభావంతుల కోసం, అవసరమైన వారికి స్క్రైబ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. దివ్యాంగుల వికలాంగత్వ శాతాన్ని పరిశీలించిన తరువాతే స్క్రైబ్‌లను అనుమతించాలని స్పష్టం చేశారు. గాయత్రి డిగ్రీ కళాశాల, శ్రీచైతన్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఆర్‌కే జూనియర్ కళాశాల, గాయత్రి జూనియర్ కళాశాల, ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల, సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, ఏజీఎల్ కళాశాల, ఆర్‌కే డిగ్రీ కళాశాల, సత్యా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గాజులరేగ, ఎంఆర్ కళాశాల, శ్రీనివాస జూనియర్ కళాశాల, జేఎన్‌టీయూ గురజాడ యూనివర్సిటీ వద్ద పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డీఆర్‌ఓ ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్ పరీక్షల విభాగం సూపరింటెండెంట్ పీవీ మహేష్, ఏపీపీఎస్‌సీ సహాయ కార్యదర్శి వి.బాబూరావు, ప్రతినిధులు ఆర్‌వీ రమణ, యోగి, వివిధ శాఖల అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.